క్లుప్తంగా

అగ్నిప్రమాదంపై నేదురుమల్లి ఆరా



ప్రమాదంపై బ్యాంక్ అధికారులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్‌లో అగ్నిప్రమాదం కారణంగా తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం బ్యాంక్‌ను పరిశీలించారు. ప్రమాదంపై ఆరా తీశారు. సంఘటనకు గల కారణాలు, జరిగిన నష్టాన్ని బ్యాంక్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ వివరించారు. ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ డైరెక్టర్ విజయకుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగూర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఈవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలను స్వీకరిస్తున్న అధికారి శ్రీనివాసబాబు

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా గూడూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్న డబ్బుగుంట వెంకటేశ్వర్లు జొన్నవాడ కామాక్షి పరమేశ్వరి ఆలయంలో సుమారు రూ.7 కోట్లు దుర్వినియోగం చేసిన ఆరోపణల్లో సస్పెండ్ అయ్యారు. ఆయన స్థానంలో గూడూరు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసబాబును ఇన్‌చార్జిగా నియమించారు.

అందరికీ ఉపాధి హామీ పనులు



మజ్జిగ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీవో అన్నపూర్ణారావు

పెళ్లకూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి ఉపాధి హామీ కింద పనులు కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అన్నపూర్ణారావు తెలిపారు. ఆయన గురువారం నెలబల్లిలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చూపించాలన్నారు. వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇచ్చి రైతులు, వ్యసాయ కూలీలకు ఉపయోగకరంగా పనులు చేపట్టాలన్నారు. పని పూర్తి అయిన వెంటనే మస్టర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కూలీలకు సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ తిరుపాలు పాల్గొన్నారు.

8న ఎస్ఎంసీ ఎన్నికలు

దొరవారిసత్రం : ఈ నెల 8న ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంఈవోలు మునిశేఖర్, కృష్ణయ్య తెలిపారు. ఎన్నికల నిర్వహణపై ఆయా పాఠశాల హెచ్‌ఎంలకు అవగాహన కల్పించామన్నారు. ప్రతి పాఠశాలలోనూ పిల్లల తల్లిదండ్రుల ఓటర్ల జాబితాను నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేస్తామని, ఎన్నికల విధి విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



పాఠశాలకు మైక్ సెట్ అందజేస్తున్న యువకులు

తడ: మండలంలోని కారూరు పంచాయతీ కాశింగాడుకుప్పం ప్రాథమికోన్నత పాఠశాలకు గురువారం బాలకృష్ణాపురం కుప్పానికి చెందిన యువకులు రాంకుమార్, లోకనాథం రూ.20 వేల విలువైన మైక్‌సెట్‌ను వితరణ చేశారు. వారికి హెచ్‌ఎం రఘురామయ్య కృతజ్ఞతలు తెలిపారు. టీచర్ కలీముల్లా పాల్గొన్నారు.

తిరుమలకు బస్సు నడపాలి

గూడూరు రూరల్ : గూడూరు నుంచి తిరుమలకు ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని బీజేవైఎం నాయకులు కోరారు. వారు గురువారం గూడూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పలు ప్రాంతాలకు చెందిన భక్తులు గూడూరు వరకు రైలులో వచ్చి తిరుమలకు బస్సులో వెళతారని తెలిపారు. గతంలో బస్సులు ఎక్కువగా ఉండేవని, కరోనా సమయంలో రద్దు చేశారని గుర్తు చేశారు. మళ్లీ ఆర్టీసీ బస్సులను నడపాలని కోరారు. అలాగే గూడూరు నుంచి బెంగళూరుకు బస్సు నడపాలని విజ్ఞప్తి చేశారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ అధికారులతో చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి గిద్దలూరు మనోజ్ కుమార్, శివశంకర్, నవీన్, కిరణ్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 6.110 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 6.110 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయిగంగ కాలువకు 125, లోలెవల్ కాలువకు 15 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం



ఓజిలి: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



దక్కిలి: తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఓజిలి: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన తెలిపారు. కురుగొండ హెచ్‌డబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న పౌష్టికాహారం, గుడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాజా కురగాయలు, పండ్లు, ఆకుకూరలు, పాలు తదితర పదార్థాలను ఎక్కువ మోతాదులో తీసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతి, కార్యకర్తలు సుహాసిని, రాజేశ్వరి, అనూష తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పాలివ్వాలి

దక్కిలి: బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని స్థానిక వైద్యాధికారిణి బిందు ప్రియాంక తెలిపారు. కమ్మపల్లి అంగనవాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పరిమళ, హెల్త్ సూపర్ వైజర్ ఆదిలక్ష్మీ, వర్కర్స్ సుజాత, వెంకటమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో..

రాపూరు: పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సీడీపీవో సునందన తెలిపారు. పంగిలి, శానాయిపాళెం, ఆదురుపల్లి, కంబాలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం వరకు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు అరుణ, ధనమ్మ, రాజేశ్వరి, అంకమ్మ పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్ : పుట్టిన పిల్లలకు తల్లి పాలు ఎంతో శ్రేష్టమని సూళ్లూరుపేట సబ్ డివిజన్ సీడీపీవో శారదాంబ తెలిపారు. సూళ్లూరుపేట మండలం ఇలుపూరులో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాల వల్ల పిల్లల్లో ఎదుగుదల బాగుంటుందన్నారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మనిషా సింగ్, అంగన్‌వాడీ కార్యకర్త పద్మ తదితరులు పాల్గొన్నారు.

చిల్లకూరు : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక తెలిపారు. మండలంలోని క్రిష్ణాపురం గిరిజన కాలనీలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించి తల్లులకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కొంత మంది తల్లులు బిడ్డకు పాలు ఇస్తే అందం దెబ్బతింటుందని అపోహ పడుతుంటారని, అది వాస్తవం కాదన్నారు.



చిల్లకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రేణుక



వెంకటగిరి రూరల్ : తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్న సీడీపీవో శంషాద్‌బేగం

తల్లిపాల విశిష్టతపై అవగాహన

నాయుడుపేట టౌన్ : తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. నాయుడుపేట మండలం అత్తిమిట్టలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం లాటిందని, ముర్రుపాలు పట్టించడం వల్ల పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పిల్లల ఎదుగుదల బాగుటుందని వివరించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : శిశువు పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టించాలని, తద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని సీడీపీవో శంషాద్‌బేగం తెలిపారు. వెంకటగిరిలోని తోలిమిట్ట, బాలాయపల్లి మండలంలోని పెరిమిడి అంగన్‌వాడీ సెంటర్లలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను సద్వినియోగం చేసుకోండి



పుదూరులో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

నాయుడుపేట టౌన్ : క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మీ కోరారు. మండలంలోని పుదూరులో గురువారం తిరుపతి స్విమ్స్ వైద్యశాల సౌజన్యంతో నిర్వహించిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆమె పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ వైద్యులు డాక్టర్ శంకరయ్య, డాక్టర్ వికాస్ మాట్లాడుతూ పింక్ బస్సులో నోరు, రొమ్ము, గర్భకోశానికి సంబంధించిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. 30 ఏళ్లు దాటిన ప్రతి మహిళా పరీక్షలు చేసుకోవాలని సూచించారు. క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిని తిరుపతి వైద్యశాలకు తీసుకెళ్లి పూర్తి స్థాయిలో చికిత్స అందిస్తామన్నారు. అనంతరం పుదూరు పంచాయతీలోని వివిధ గ్రామాలకు చెందిన 76 మందికి క్యాన్సర్ పరీక్షలతోపాటు షుగర్, బీపీ తదితర వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తిరుపతి స్విమ్స్ వైద్యులు శ్రావంతి, పీఆర్వో చంద్రమోహన్, టెక్నీషియన్ రెడ్డి ప్రసూన, పుదూరు సర్పంచ్ మల్లాపు సుమతి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్ గోవిందయ్య, నాయకులు ఆకుతోట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఆర్టీసీ బస్సు



ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామస్తులు

నాయుడుపేట టౌన్ : మండల పరిధిలోని మాబాక, కోనేటి రాజుపాళెం, మేనకూరు తదితర గ్రామాలను కలుపుతూ గురువారం ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ ఆర్టీసీ బస్సును ఏర్పాటు చేయాలని మాబాక తదితర గ్రామాలకు చెందిన నాయకులు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి విన్నవించారు. ఆమె శ్రీకాళహస్తి డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానం చేస్తూ బస్సు నడపాలని ఆదేశించారు. ఈ క్రమంలో గురువారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ బస్సు శ్రీకాళహస్తి నుంచి పెళ్లకూరు మండలం కలవకూరు, పెరుమాళ్లపల్లి, జంగాలపల్లి, గుర్రపుతోట, పాలచ్చూరు, మండలంలోని మాబాక, కోనేటి రాజుపాళెం, మేనకూరు గ్రామాల మీదుగా నాయుడుపేటకు వెళుతుంది. మాబాక గ్రామం వద్ద నాయకులు, గ్రామస్తులు గురువారం ఆర్టీసీ బస్సును స్వాగతించి డ్రైవర్, కండక్టర్లకు స్వీట్లు అందించి కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి తవ్వకాలు ఆపాలని వినతి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీటీసీ, సర్పంచ్‌లు

చిల్లకూరు : తీర ప్రాంతంలోని పొన్నవోలు చెరువులో మట్టి తవ్వకాలను గురువారం ప్రజాప్రతినిధులు, స్థానికులు అడ్డుకున్నారు. అనంతరం టీడీ మస్తానయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతవరం, ఎంపీటీసీ పాలూరు మాధవి, సర్పంచ్ జోగి సుగుణమ్మ మాట్లాడుతూ చింతవరం గ్రామ దళితవాడ సమీపంలో ఉన్న పొన్నవోలు చెరువులో ఇష్టానుసారంగా మట్టిని తవ్వేస్తున్నారని తెలిపారు. అనుమతులకు విరుద్ధంగా 30 అడుగుల కంటే ఎక్కువ లోతుతో గుంతలు తవ్వుతున్నారని, అలాగే పొన్నవోలు రోడ్డు దగ్గరకు వస్తుండడంతో గ్రామానికి వెళ్లే రోడ్డు దెబ్బతింటోందని వాపోయారు. భారీ వర్షాలు కురిస్తే వర్షపునీరు సమీపంలో ఉన్న దళితవాడలోకి చేరుతుందని తెలిపారు. స్పందించిన డీటీ మాట్లాడుతూ నీటి పారుదల శాఖ వారికి విషయం తెలియజేస్తామని హామీ ఇచ్చారు.

సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం

రాపూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు గురువారం ఇచ్చిన తీర్పుపై ఎంఈఎఫ్ నాయకుడు బొజ్జ మల్లేశ్వరావు గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ న్యాయబద్ధమని, రాష్ట్రాలు వర్గీకరణ చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ తీర్పు ఇవ్వడం అభినందనీమని వెల్లడించారు. వర్గీకరణ కోసం చేసిన దశాబ్దాల పోరాటానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాలు వర్గీకరణకు నడుంబిగించాలని, అలాగే ప్రధాని నరేంద్రమోదీ వర్గీకరణ అములయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ నేతల సంబరాలు

దక్కిలి : ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షనీయమని తిరుపతి జిల్లా మాదిగ ఉద్యోగ సమాఖ్య ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య, ఏపీ ప్రజా సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గద్దల మునెయ్య మాదిగ తెలిపారు. వారు గురువారం దక్కిలి- కమ్మపల్లి రోడ్డు సెంటర్‌లో మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేశీనయ్య, పాపయ్య, కృష్ణయ్య, ఈశ్వరయ్య, చెంచుమోహన్, పోలయ్య, కిరణ్ పాల్గొన్నారు.

జయబాబు సేవలు చిరస్మరణీయం



పేదలకు అన్నదానం చేస్తున్న నాయకులు

నాయుడుపేట టౌన్ : ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్యవైశ్య సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు పెసల జయబాబు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు తంబిరెడ్డి జనార్ధన్ రెడ్డి కొనియాడారు. పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద గురువారం జయబాబు జయంతిని జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పెసల జయరాజగోపాల్, కిషోర్‌బాబు, రమేష్‌బాబు, ఆర్యవైశ్య సంఘం రూరల్ అధ్యక్షుడు కనమర్ల పూడి సుబ్రమణి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కోటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ప్రారంభం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఎల్ఏ సాగరం పాత బీడీ కాలనీలో వేసిన బోరును గురువారం మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం ప్రారంభించారు. పాత బీడీ కాలనీ, ఎల్ఏ సాగరం, కొత్త బీడీ కాలనీ, లోతువానిగుంట ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉండడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.5 లక్షలతో మున్సిపల్ అధికారులు బోరు వేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న సీడీపీవో ఉమామహేశ్వరి

నాయుడుపేట టౌన్ : మండలంలోని బిరదవాడ జాతీయ రహదారి సమీపంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులకు గురువారం ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి మిషన్ శక్తిపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు నేరమని, లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని, బ్యాడ్, గుడ్ టచ్ తదితర విషయాలను వివరించారు. ఉమెన్ హెల్ప్ లైన్ నంబర్లు అందజేశారు. ప్రిన్సిపాల్ రూత్‌రమోల పాల్గొన్నారు.

96 శాతం పింఛన్ల పంపిణీ

ఓజిలి/నాయుడుపేట టౌన్/దొరవారిసత్రం/చిల్లకూరు : సామాజిక పింఛన్లను గురువారం 96 శాతం పంపిణీ చేసినట్లు ఓజిలి ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన గురువారం ఓజిలి మండలం కురుగొండ, ఓజిలి, రాచపాళెంలో పింఛన్ల పంపిణీని పరిశీలించారు. మండలంలో 5,556 మందికిగాను 5,336 మందికి నగదు అందజేసినట్లు తెలిపారు. నాయుడుపేట మున్సిపాలిటీ, మండలంలో 95 శాతానికి పైగా పింఛన్లు ఇచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ జనార్దన్ రెడ్డి, ఎంపీడీవో ప్రేమ్‌రాజ్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీలో 4,161 మందికి గాను 4,011 మందికి, మండలంలో 5,062 మందికి గాను 4,829 మందికి నగదు ఇచ్చినట్లు వెల్లడించారు. దొరవారిసత్రం మండలం అక్కరపాక, తల్లంపాడులో ఎమ్మెల్యే విజయశ్రీ ఎంపీడీవో శివరాజు, టీడీపీ నేతలతో కలిసి పింఛన్ ఇచ్చారు. చిల్లకూరు, గూడూరు మున్సిపాలిటీలో ఎమ్మెల్యే సునీల్‌కుమార్ పింఛన్లు పంపిణీ చేశారు.

వృద్ధాశ్రమానికి దాతల చేయూత



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న సుదర్శన్ రెడ్డి

నాయుడుపేట టౌన్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి గురువారం మేనకూరు సెజ్ పరిధిలోని అరబిందో ఫార్మా పరిశ్రమ అడ్మిన్ హెడ్ వుడుము సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు దుప్పట్లు అందజేశారు. మధ్యాహ్నం బిర్యానీ పెట్టారు. సుదర్శన్ రెడ్డి తల్లి రాజేశ్వరి జ్ఞాపకార్థం ఆశ్రమంలో ఉన్న వృద్ధులకు చేయూత ఇచ్చినట్లు తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు సునిత, బెన్నిని అభినందించారు. అరబిందో పరిశ్రమ అడ్మిన్ మేనేజర్ మహేష్ రెడ్డి, సెక్యూరిటీ హెడ్ నరేంద్ర, సిబ్బంది గిరిరెడ్డి, పి.గోపి, మహేష్ పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు



కళ్ల అద్దాలు అందజేస్తున్న జిందాల్ పరిశ్రమ ప్రతినిధులు

చిల్లకూరు : మోమిడి సచివాలయంలో గురువారం తమ్మినపట్నం సమీపంలో ఉన్న జిందాల్ పవర్ ప్రాజెక్టు, జేఎస్‌పీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాంట్ హెడ్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల్లూరులోని జయభారత్ ఆస్పత్రి సహకారంతో పేదలకు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేయించినట్లు తెలిపారు. మోమిడి పంచాయతీలోని పునుగుంటపాళెం, మోమిడి, మత్స్యకార కాలనీల్లో సుమారు 100 మందికి వైద్య పరీక్షలు చేసి శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని నెల్లూరులోని జయభారత్ ఆస్పత్రికి తరలించనున్నట్లు తెలిపారు. వారికి పరిశ్రమ ఖర్చులతో వైద్యం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో వరగలి పీహెచ్‌సీ వైద్యులు గీతామణి, పరిశ్రమ ప్రతినిధులు ఖలీద్, క్రిష్టారెడ్డి, మ్యాథ్యూ, గ్రామ సర్పంచ్ ఈదూరు లావణ్య పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



చెలికం శంకర్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటామని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. జంగాలపల్లి సర్పంచ్ పాలూరు ప్రమీల భర్త మనోహర్ అనారోగ్యానికి గురై విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం సర్పంచ్ నివాసం వద్దకు చేరుకుని ప్రమీల, మనోహర్ దంపతులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, నాయకులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. జేసీఎస్ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, వెంకటగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ వెందోటి మధురెడ్డి, నాయకులు సదారెడ్డి, రమేష్‌రెడ్డి, తిరుమల, వేణురెడ్డి, కూనా మల్లికార్జున్ పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డి మృతి తీరనిలోటు

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ చెలికం శంకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని ఆ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని రాణిపేటలో చెలికం శంకర్‌రెడ్డి నివాసంలో గురువారం ఉత్తరక్రియలు నిర్వహించారు. ఇందులో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. శంకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంకర్‌రెడ్డి కుటుంబానికి తమకు 40 ఏళ్ల అనుబంధమన్నారు. గతంలో తన తల్లిదండ్రులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, రాజ్యలక్ష్మి గెలుపునకు కృషి చేశారని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ తనకు తోడుగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి పాటుపడ్డారని గుర్తుచేసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కాల్తీరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోదరులు విశ్రాంత వీఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి ఇటీవల మృతి చెందడంతో మొగళ్లగుంటలోని చంద్రశేఖర్‌రెడ్డి నివాసం వద్దకు వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రముఖ వైద్యులు, మస్తాన్ యాదవ్ చారిటుబల్ ట్రస్టు అధినేత మస్తాన్‌యాదవ్, సదారెడ్డి, మధురెడ్డి, తిరుమల, కునామల్లికార్జున్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురవారెడ్డి కుటుంబానికి పరామర్శ

వాకాడు : వాకాడుకు చెందిన రిటైర్డ్ టీచర్ దుగ్గిరెడ్డి గురవారెడ్డి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురవారెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారుడు దుగ్గిరెడ్డి రాజశేఖర్ రెడ్డిని ఓదార్చారు. నేదురుమల్లి హిమకుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, శేషురెడ్డి, గూడూరు సుధాకర్‌రెడ్డి, నెల్లూ రు పెంచల రెడ్డి, మాగుంట శీనారెడ్డి, పాల్గొన్నారు.



మనోహర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నేదురుమల్లి



గురవారెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి

- ఉపాధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పనుల్లో నాణ్యత పాటించాలని ఆదేశం



కూలీలతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి రూరల్ : అమృత్ సరోవర్ పథకం కింద ఉపాధి హామీ నిధులతో చెరువులను అభివృద్ధి చేస్తున్నట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన గురువారం వెంకటగిరి రూరల్ మండలం కళవలపూడి పంచాయతీలో ఉపాధి హామీ కింద 25 లక్షల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో చేపడుతున్న మినీ అమృత్ సరోవర్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చెరువుల అభివృద్ధితో నీరు ఎక్కువగా నిల్వ ఉంటుందన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని చెప్పారు. పశువులు, జంతువులకు తాగునీరు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. అనంతరం రూ.9.80 లక్షల ఉపాధి నిధులతో పాపమాంబపురంలో చేపడుతున్న మైనర్ ఇరిగేషన్ ట్యాంకు, చెరువు కట్ట బలోపేతం పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు. అర్హులైన ఉపాధి కూలీలకు 100 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, అసిస్టెంట్ పీడీ ప్రేమ్‌కుమార్, ఏపీవో విజయలక్ష్మి, ఏపీవో దీప పాల్గొన్నారు.

అల్తూరుపాడు రిజర్వాయర్ పరిశీలన

దక్కిలి: సోమశిల–స్వర్ణముఖి లింక్ కెనాల్‌లో అంతర్భాగమైన అల్తూరుపాడు రిజర్వాయర్‌ను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం ఒక టీఎంసీ అని, ఇది పూర్తయితే శ్రీకాళహస్తి, వెంకటగిరి నియోజకవర్గాల్లో సుమారు 90 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. దీనికి 34 కిలోమీటరు వద్ద కండలేరు–పూండి కాలువ నీటిని లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నింపుతామన్నారు. ఎస్ఎస్ కెనాల్ ద్వారా ఏర్పేడు మండలం మేర్లపాక చివరి ట్యాంక్‌కు నీటిని గ్రావిటీపై సరఫరా చేయవచ్చని, అక్కడి నుంచి లిఫ్ట్ చేసి మల్లెమడుగు బాలాజీ రిజర్వాయర్‌కు పంప్ చేస్తామన్నారు. తిరుపతి, తిరుమల ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తామని వెల్లడించారు. తెలుగు గంగ ఎస్ఈమదన్ గోపాల్, ఈఈ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

చిల్లకూరు : మండలంలోని మోమిడి క్రీడా మైదానంలో ఆరు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు గురువారం కూడా ఉత్సాహంగా జరిగాయి. కోట మండలం కొక్కుపాడు, చిల్లకూరు మండలం కలవకొండ జట్లు తలపడ్డాయి. ముందుగా బ్యాటింగ్ చేపట్టిన కొక్కుపాడు జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 78 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన కలవకొండ జట్టు 8 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసి విజయం సాధించింది. మధ్యాహ్నం జరిగిన మ్యాచ్‌లో సర్వేపల్లి నియోజకవర్గంలోని క్రిష్ణపట్నం, చిల్లకూరు మండలంలోని తమ్మినపట్నం జట్లు తలపడాల్సి ఉండగా క్రిష్ణపట్నం జట్టు హాజరు కాకపోవడంతో తమ్మినపట్నం జట్టును విజేతగా ప్రకటించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరి రూరల్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ జోన్ సీనియర్ విభాగం క్రికెట్ పోటీలు గురువారం వెంకటగిరిలోని తారకరామ క్రీడా ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. మొదటి ఇన్నింగ్స్‌లో కడప–చిత్తూరు జట్ల మధ్య పోటీ జరిగింది. కడప జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 43.1 ఓవర్లకు 142 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ దిగిన చిత్తూరు జట్టు 34 ఓవర్లకు 176 పరుగులు చేసి 5 వికెట్‌లు కోల్పోయింది. 34 పరుగుల తేడాతో చిత్తూరు జట్టు లీడ్‌లో ఉంది.